క్లుప్తంగా

గొల్ల, కురుమల అభ్యున్నతికి కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సంగారెడ్డి మున్సిపాలిటీ: గొల్ల, కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం పుల్కల్ మండలంలోని కోడూరు గ్రామంలో గొల్ల కురుమలకు సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డితో కలిసి గొర్రెల యూనిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గొల్ల, కురుమలను విస్మరించాయన్నారు. గత ఎన్నికల్లో కోడూరు గ్రామంలో బీఆర్ఎస్‌కు అధిక మెజార్టీ ఇచ్చి బ్రహ్మరథం పట్టినందుకుగాను మొట్టమొదటిగా పుల్కల్ మండలంలో కోడూరు గ్రామంలోనే గొర్రెల యూనిట్లను అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయకుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లిలో పలువురు లబ్ధిదారులకు రెండో విడతలో భాగంగా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై మంజూరైన ఆరు యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. సర్పంచ్ అమృత యేసయ్య, ఉపసర్పంచ్, గొల్ల, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భూములు మావి.. ఇళ్లు బయటివారికా?

- నిరసన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు




మోకిలా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో నిర్మించిన రెండు పడకల ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరిగిందంటూ శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొల్లూరులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొల్లూరు మాజీ ఉపసర్పంచ్ రాజుగౌడ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో ఇచ్చిన భూములను కేసీఆర్ ప్రభుత్వం తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూముల్లో నిర్మించిన రెండు పడకల ఇళ్లలను భూములు కోల్పోయిన వారికి కేటాయించకపోవడం బాధాకరమన్నారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలోని నివసించే నిరుపేదలకు 10శాతం ఇళ్లను కేటాయిస్తామని గతంలో హామీ ఇచ్చారన్నారు. కానీ.. తమ ప్రాంతంలో రెండు పడకల ఇళ్లను నిర్మించి ఇతర ప్రాంతాల వారికి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామని తెలిపారు. నిరసన తెలుపుతున్న నిరసనకారులను పోలీసులు మోకిలా పోలీస్‌స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పావని, సరిత, మయూరి, మంజుల, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు రవీందర్ పాల్గొన్నారు.

తారా కళాశాలలో జాతీయ సెమినార్

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో కెమికల్ సింథసిస్, అనాలసిస్-ఆధునిక ధోరణులు అంశంపై శనివారం జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. సెమినార్‌కు ప్రధాన వక్తగా విచ్చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాష్‌రావు మాట్లాడుతూ రసాయన సంశ్లేషణలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. అందులో ప్రధానమైనది ఔషధాల ఆవిష్కరణ అభివృద్ధి అని తెలిపారు. పెరోవ్స్ కైట్ సోలార్ సెల్స్ వాటి శక్తి సామర్థ్యాలు, ఔషధాల శుద్ధీకరణ వినియోగ మార్గాల తయారీ, మూలకాల విశ్లేషణలో ఉపయోగించే న్యూట్రాన్ ఆక్టివేషన్ అనాలసిస్ వంటి అంశాలను వివరించారు. సెమినార్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు, కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. శనివారం 5వ బ్లాక్‌లో బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నాయకులు అశోక్, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో చెరువులు, కుంటలు



కొదకంచి శివారులోని కుంటను కబ్జా చేస్తూ వేసిన రాళ్లు

- బఫర్ జోన్‌లను వదలని అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్‌శాఖ
- ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికుల విన్నపం

జిన్నారం(పటాన్‌చెరు): హైదరాబాద్‌కు సమీపంలో జిన్నారం మండలం ఉండటంతో ఇక్కడి భూములకు రెక్కలొచ్చాయి. పారిశ్రామిక ప్రాంతాలు కావటంతో భూముల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో కొంతమంది అక్రమార్కులు శిఖం భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. అయినప్పటికీ ఇరిగేషన్‌శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న జిన్నారం మండలంలోని బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం తదితర ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న గ్రామాల్లో కబ్జాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్టర్లు, రాజకీయ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు.

◆ బొల్లారం మున్సిపల్ పరిధిలో పలు కుంటలు, చెరువులు ఇప్పటికే కబ్జాలకు గురయ్యాయి. ప్రస్తుతం చెరువులు, కుంటల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా చేపడుతున్నారు. బీసీ కాలనీకి ఆనుకొని ఉన్న కుంటలను కబ్జా చేసి బఫర్ జోన్ పరిధిలో కూడా విల్లాలు నిర్మిస్తున్నారు.

◆ ఖాజీపల్లిలోని ఖాజీచెరువు నుంచి అలుగు పారుతున్న వాగు స్థలాన్ని తగ్గించి ఓ సంస్థ అపార్టుమెంట్లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. వర్షాలు పడుతున్న సమయంలో ఈ ప్రాంతం నీటితో నిండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ కొడకంచి గ్రామ శివారులోని ఓ కుంటను కబ్జా చేస్తూ కొంతమంది రాళ్లను వేశారు.

◆ జిన్నారం మండల కేంద్రంలోని పోసానికుంట ఆనవాళ్లు లేకుండా చేశారు.

◆ ఊట్ల గ్రామ పరిధిలో పలు కుంటలకు సంబంధించిన అలుగు ఆనవాళ్లు లేకుండా చేసి కొంతమంది ఫంక్షన్ హాల్‌లు నిర్మించారు.

◆ మాదారం గ్రామంలో చెరువును ఆనుకొని ఓ వ్యక్తి ప్రహరీ నిర్మించాడు. గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందన లేదు.

◆ గడ్డపోతారంలోని అయ్యమ్మ చెరువును ఆనుకొని నిర్మాణాలు చేపట్టారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

చర్యలు తప్పవు

చెరువులు, కుంటల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నాం. శిఖం, బఫర్ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

– దిలీప్, ఇరిగేషన్‌శాఖ ఏఈఈ

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మల్లన్నస్వామి ఆలయం, బీరప్పస్వామి ఆలయ నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్మాణాలకు మొదటి విడతగా రూ.10లక్షల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటివరకు సొంత నిధులతో 180కి పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, చర్చిలు నిర్మించామన్నారు. మానసిక ప్రశాంతతకు ప్రతిఒక్కరూ భగవంతుడిని ఆరాధించాలని సూచించారు. గ్రామంలోని తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, చిన్నకంజర్ల సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు హరిశంకర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

భూమికి బదులు భూమి ఇవ్వాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్-నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులుగా భూమి కొనివ్వాలని లేదా పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, నిజాంపేట్‌కు చెందిన పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణఖేడ్ ఆర్డీఓ వెంకటేష్‌తో శనివారం సమావేశమై రైతుల పరిస్థితిని వివరించారు. భూముల ధరలు బాగా పెరిగినందునా ప్రభుత్వం అందించే అరకొర పరిహారంతో భూమిని కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆర్డీఓకు వివరించారు. బసవేశ్వర ఎత్తిపోతల పథకంలో భాగంగా మనూరు మండలం బోరంచలో సంప్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.16లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, దళితులకు దళితబంధు పథకం ద్వారా లబ్ధికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆర్డీఓ వెంకటేష్ వారికి హామీఇచ్చారు.

మానహక్కుల కౌన్సిల్ కార్యాలయం ప్రారంభం

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ప్రపంచ మానవ హక్కుల పీపుల్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని సీఐ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డబ్ల్యూహెచ్ఆర్‌పీసీ అధ్యక్షుడు నవోదయ సిద్దు మాట్లాడుతూ మానవ హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ సంస్థ 24గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, జిల్లా అధ్యక్షుడు బాబు, ప్రకాష్, మోసిన్ అహ్మద్, గుండప్ప, శ్రీపాల్ పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సదాశివపేట(సంగారెడ్డి): పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని చేనేత సహకార సంఘం పట్టణ అధ్యక్షుడు చింతా గోపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలో పట్టణ నూతన పద్మశాలీ సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మునిపల్లి విశ్వనాథం, కార్యదర్శులుగా నక్క ప్రభాకర్, చిలువరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా కోట రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులను చింతా గోపాల్, కులదైవముల అధ్యక్ష కార్యదర్శులు శాలువాలతో సన్మానించారు. నాయకులు మల్లేశం, అంబటి విశ్వనాథం, అంబయ్య, అడ్డగట్ల మనోహర్, గణేశం, నర్సింహులు, మనోహర్, రవి, మానేయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రభాకర్, శేఖర్, సురేందర్ పాల్గొన్నారు.



రామచంద్రాపురం: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



చిట్కుల్ గ్రామంలో...



నారాయణఖేడ్‌లో...



పటాన్‌చెరు టౌన్: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పటాచెరు టౌన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. రైతులకు రుణమాఫీ, ఆసరా పింఛన్లు, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిట్కుల్ గ్రామంలో...

పటాన్‌చెరు మండలంలోని చిట్కుల్ గ్రామంలో వైఎస్సార్ వర్ధంతిని వైఎస్ఆర్‌టీపీ దళిత విభాగం నాయకులు డప్పు రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, రాజు, మహేందర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతిని శనివారం తెల్లాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే చెందుతుందన్నారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, స్థానిక నాయ కులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో...

నారాయణఖేడ్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నారాయణఖేడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డి నివాసాల్లో వైఎస్సార్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేశ్ దేశ్‌ముఖ్, కౌన్సిలర్ దారం శంకర్ పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: వైఎస్సార్ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముల్తానీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అండగా ఉంటాం

జిన్నారం(పటాన్‌చెరు): ముదిరాజ్‌లమంతా ఏకమై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి అండగా ఉంటూ గెలిపించుకుంటామని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మండలంలోని ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు జనార్దన్, చిట్ల సత్యనారాయణ, ఆంజనేయులుతో కలిసి శివకుమార్ శనివారం జిన్నారంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను విడదీసే విధంగా కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముదిరాజ్ సంఘాల నాయకులు సంజీవ, ఆంజనేయులు, పెంటేశ్, శివరాజ్, రాజు, మంద రమేశ్, బ్రహ్మేందర్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): నిత్యావసర ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిరసనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. మోడీ పాలన పేదల సంక్షేమాన్ని మరిచిందని విమర్శించారు. ఉపాధి పథకానికి కేటాయింపులు కుదించడంతో కూలీల బతుకులు ఆగమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. సెప్టెంబర్ 4, 5 తేదీలలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, సాయిలు, నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతుగా ర్యాలీ

ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ధర్నా



హత్నూర: రాస్తారోకో నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా నీలం మధును ప్రకటించాలని ముదిరాజ్ సంఘం నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు దిగంబర్ ముదిరాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా దిగంబర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షల జనాభా కలిగిన ముదిరాజులకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించేవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో హత్నూర మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేందర్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరి మహేష్, షేర్ఖాన్‌పల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ, ముదిరాజ్ నాయకులు అంబటి అర్జున్, మణిదీప్, రాజు, రాజేందర్, మన్నె రమేష్, కొన్యాల సత్యం, విఠల్, మోతే కష్ణ, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం(పటాన్‌చెరు): పటాన్‌చెరు ఎమ్మెల్యే టికెట్ నీలం మధుకు కేటాయించాలని కోరుతూ అన్నారంలోని హైదరాబాద్-మెదక్ ప్రధాన రహదారిపై శనివారం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గ్యారాల మల్లేశ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ముదిరాజ్‌లు ధర్నా నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నీలం మధుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించడంపై సీఎం కేసీఆర్ పునరాలోచించుకోవాలని సూచించారు.

నీలం మధును గెలిపించుకుంటాం

పటాన్‌చెరు టౌన్: పార్టీలకతీతంగా నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తెలిపారు. శనివారం పటాన్‌చెరు మండలంలోని పెద్దకంజర్ల గ్రామానికి చెందిన యువకులు ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు సమక్షంలో ఎస్ఎంఆర్ యువసేనలో చేరారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, రుక్మయ్య, విగ్నేష్, బాల్‌రాజ్, లక్ష్మినారాయణ, రాములు, మల్లేష్, లక్ష్మణ్, సతీష్, లక్ష్మణ్, నిరంజన్, భాస్కర్, బలరాం, ముత్యాలు, గణేష్, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అర్హులందరికీ డ్రైవింగ్ లైసెన్స్‌లు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సంగారెడ్డి నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్‌లు అందిస్తామని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో 46మంది యువకులకు లైసెన్స్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీహరి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **హైదరాబాద్‌కు తరలిన బీజేపీ శ్రేణులు**

జహీరాబాద్: బీజేపీలో చేరేందుకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పలువురు హైదరాబాద్ తరలివెళ్లారు. శనివారం డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీలకు చెందిన పలువురు హైదరాబాద్ తరలివెళ్లి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో న్యాల్‌కల్ మాజీ జడ్పీటీసీ శివాజీ పాటిల్, మల్‌చల్మ మాజీ సర్పంచ్ బిచ్చిరెడ్డి, జహీరాబాద్ పట్టణానికి చెందిన మహేష్ పాటిల్, మధు, మహేష్, బద్రి, శ్రీకాంత్ ఉన్నారు.

◆ **పోలింగ్ స్టేషన్ల సందర్శన**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను శనివారం ఆర్డీఓ వెంకారెడ్డి సందర్శించారు. ఓటుహక్కుపై జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఆదివారం వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

◆ **ఉపాధ్యాయ దినోత్సవ సన్నాహక సమావేశం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని 6వ తేదీన సన్మానించనున్నట్లు చింతా ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక సంయుక్త స్కూల్‌లో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, ఎంఈఓ అంజయ్య, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

◆ **మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలి**

పటాన్‌చెరు టౌన్: 25వేల డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన చేయాలని కోరుతూ పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎన్ఎస్‌యూఐ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి సోహెల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు యువరాజ్, కుంచళ కిషన్ పాల్గొన్నారు.

◆ **ప్రాతినిధ్యం కోసం యుద్ధం చేద్దాం**

పటాన్‌చెరు టౌన్: చట్టసభల్లో మన బిడ్డలకు సరైన ప్రాతినిధ్యం దొరికినప్పుడే మన భవిష్యత్తు బాగుంటుందని జిన్నారం ముదిరాజ్ సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ సామాజికవర్గానికి సరైన ప్రాతినిధ్యం కల్పించి ఐదు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్‌తో ముదిరాజ్ సంఘాల నాయకులు శనివారం పెద్దకంజర్లలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 65 లక్షల జనాభా కలిగి రాష్ట్ర భవిష్యత్తును మార్చగల సత్తా ఉన్న ముదిరాజ్ సామాజికవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరిస్తూ ఒక్క అసెంబ్లీ సీటును కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ కుట్ర రాజకీయాలను గమనించి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు మహేష్, శ్రీనివాస్, జిన్నారం మండల ముదిరాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు చిరుమణి పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో రూ.50లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్ రంగ సురేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులోని ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ తిరుపతి, మాజీ మార్కెట్ చైర్మన్ మల్లికార్జున్, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **ఐనోల్‌లో వైద్య శిబిరం**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో ఏషియన్ పెయింట్స్ వారి సహకారంతో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధి సాంబరాజు, వైద్యులు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న మట్టి సేకరణ కార్యక్రమం**

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 4న భూమి పుత్రుల ఆకలికేక-మట్టి మనుషుల మనోగతం పేరుతో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఢిల్లీ వసంత్ బృందం సభ్యులు మండలంలోని బర్దిపూర్, పొట్టిపల్లి, ఎల్గోయి, కుప్పానగర్ తదితర గ్రామాల్లో పంట పొలాల్లోని మట్టిని సేకరించారు. సభ్యులు ఓంకార్, విష్ణు, శివకుమార్ పాటిల్, చందు పాల్గొన్నారు.

◆ **బొల్లారంలో ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి**

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికులకు ఉపయోగపడే ఈఎస్ఐ ఆస్పత్రిని బొల్లారంలో ఏర్పాటు చేయాలని బొల్లారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనంద్‌కృష్ణారెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ ఆస్పత్రి బొల్లారానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అక్కడి వెళ్లేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో బొల్లారంలో ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

◆ **జాతీయ భావం పెంపొందించుకోవాలి**

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ జాతీయ భావం పెంపొందించుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. శనివారం సంగారెడ్డి పట్టణంలో న్యూ బస్టాండ్, భద్రకాళీ సమేతవీరభద్రస్వామి దేవాలయ సమీపంలో మేరీ మట్టి-మేరీదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ అరుణ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు యశ్వంత్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా డీడీఎస్ సంబరాలు**

జహీరాబాద్: డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఏర్పడి నాలుగు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా శనివారం మండలంలోని పస్తాపూర్ గ్రామంలోని డీడీఎస్ కార్యాలయంలో సంస్థ సభ్యులు, మహిళా రైతులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యురాలు రుక్మిణీరావు మాట్లాడుతూ డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీష్ నిస్వార్థంగా సంస్థను నడిపారన్నారు. దళిత మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. సంస్థ పురోభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు., కార్యక్రమంలో డీడీఎస్ బోర్డు సభ్యులు సంజయ్, శాంతసిన్హా, వినోద్ పావురాల, సలోమి, ఏసుదాస్, వేదకుమారి, న్యాల్‌కల్ ఎంపీపీ గంగ్వార్ అంజమ్మ పాల్గొన్నారు.